నత్తనడకన 'జల్ జీవన్' పనులు!

- ఏడాది క్రితం నాతవరం మండలంలో ప్రారంభం
- రెండు పంచాయతీలలో మాత్రమే పూర్తి



... వార్త 7వ పేజీలో

టికెట్ టెన్షన్!

నేడు టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థుల తొలి జాబితా విడుదల?

- ఆశావహుల శక్తిసామర్థ్యాలపై అంతర్గత సర్వేలు నిర్వహించిన ఇరుపార్టీల అధినేతలు
- అభ్యర్థుల ఎంపికపై ఇప్పటికే కసరత్తు పూర్తి
- ఏ స్థానంలో.. ఏ పార్టీ పోటీ చేస్తుందన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశం
- ఆశావాహులు ఎదురు చూపులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో జిల్లాలో ఏ అసెంబ్లీ టికెట్, ఎవరికి దక్కుతుందన్న దానిపై తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన ఆశావహులతోపాటు నాయకుల్లో కూడా ఉత్కంఠ నెలకొంది. టీడీపీ అధిష్ఠానం ఇప్పటికే రాయలసీమతోపాటు నెల్లూరు నుంచి తూర్పుగోదావరి వరకు ఉమ్మడి జిల్లాల్లో పలు స్థానాలకు అభ్యర్థులను అనధికారికంగా ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఇదే మాదిరిగా ఉమ్మడి విశాఖ జిల్లాలో కొన్ని స్థానాలకు అనధికారికంగా అభ్యర్థుల ఎంపికపై కొద్ది రోజుల నుంచి ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం తొలిజాబితా విడుదల అవుతుందని ప్రచారం జరుగుతుండడంతో ఇరు పార్టీల నేతల్లో ఉత్కంఠ నెలకొంది.

అనకాపల్లి పార్లమెంటు స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు వుండగా, వీటిల్లో నియోజకవర్గ కేంద్రమైన పెందుర్తి విశాఖ జిల్లాలో వున్న విషయం తెలిసిందే. నర్సీపట్నం నుంచి టీడీపీ అభ్యర్థిగా సీనియర్ నేత అయ్యన్నపాత్రుడు పోటీ చేయడం ఖాయమని ఇరు పార్టీల నేతల మాటలనుబట్టి అర్థం అవుతున్నది. మిగిలిన ఐదు స్థానాల్లో టీడీపీ జనసేన పార్టీలు ఏయే స్థానాల్లో పోటీ చేస్తాయన్న దానిపై శనివారం కొంతమేర స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. దీంతో ఆయా పార్టీల తరఫున పోటీ చేయాలనుకుంటున్న ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వుండడం, టీడీపీ-జనసేన కూటమి కచ్చితంగా విజయం సాధిస్తుందని పలు సర్వేలు చెబుతుం డడంతో ఎన్నికల్లో పోటీ చేయడానికి ఇరుపార్టీలకు చెందిన పలువురు నాయకులు ఉత్సాహం చూపుతు న్నారు. అయితే పొత్తులో భాగంగా ఏ పార్టీ పోటీ చేసినప్పటికీ రెండు పార్టీలు కలిసి ఉమ్మడి అభ్యర్థిని గెలిపించుకోవాలని కిందిస్థాయిలో టీడీపీ, జనసేన నాయకులు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారు. ఇదే విషయాన్ని బహిరంగంగా కూడా ప్రకటిస్తూ ఐక్యతను చాటుతున్నారు. కాగా రెండు పార్టీలకు చెందిన పలువురు సీనియర్ నాయకులు ఇప్పటికే తమ పార్టీల అధినేతలను కలిసి రానున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. టికెట్ కోసం ఎంతమంది పోటీపడు తున్నప్పటికీ ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుందని, వైసీపీని గద్దె దించడానికి అందరూ కలిసి పనిచేయాలని ఇటీవల మాడుగుల నియోజకవర్గం కె.కోటపాడులో నిర్వహించిన 'రా.. కదలిరా..' సభలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. అయితే టికెట్ ఆశిస్తున్న వారిలో ఎవరు బలమైన అభ్యర్థి అన్నదానిపై టీడీపీ, జనసేన పార్టీల అధిష్ఠానాలు ఇప్పటికే అంతర్గతంగా రెండు, మూడుసార్లు సర్వేలు నిర్వహించి నట్టు తెలిసింది.

స్థానిక పరిస్థితులు, సామాజిక సమీకరణల నేపథ్యంలో టీడీపీ, జనసేన పార్టీలు ఏయే స్థానాల్లో పోటీచేయాలన్న దానిపై ఇరు పార్టీల అధినేతలు కసరత్తు పూర్తి చేసినట్టు సమాచారం. శనివారం జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలకు కాకుండా కొన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించే అవకాశం వుందని భావిస్తున్నారు.

నారా భువనేశ్వరి 29న రాక

'నిజం గెలవాలి' పేరుతో పర్యటన

- చంద్రబాబు జైలుకు వెళ్లినప్పుడు మనస్తాపంతో మృతిచెందిన కుటుంబాలకు పరామర్శ
- ఎలమంచిలి టీడీపీ ఇన్‌చార్జి 'ప్రగడ' వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

మునగపాక, ఫిబ్రవరి 23 : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి ఈ నెల 29న మునగపాక మండలం వస్తున్నట్టు టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఇక్కడ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం టీడీపీ అధినేత చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపడంతో పలువురు కార్యకర్తలు మనస్తాపంతో మృతిచెందారని చెప్పారు. 'నిజం గెలవాలి' పేరుతో భువనేశ్వరి ఆయా బాధిత కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక సాయం అందిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా భువనేశ్వరి ఈ నెల 29న మండలంలోని వాడ్రాపల్లి, గొల్లల పాలెం, గవర్ల అనకాపల్లి, అరబుపాలెం, కాకరాపల్లి గ్రామాల్లో పర్యటించి, చంద్రబాబు జైలుకు వెళ్లిన సమయంలో మనస్తాపంతో మృతిచెందిన వారి కుటుంబాలను పరామర్శిస్తారని అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, బీసీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు, నాయకులు దాడి ముసిలినాయుడు, డొక్కా నాగభూషణం, కర్రి సాయికృష్ణ, పెంటకోట విజయ్, మొల్లేటి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో గంజాయ్!



గంజాయి సేవించిన ఏడుగురు విద్యార్థులను పట్టుకున్న సెక్యూరిటీ సిబ్బంది



- వారి జేబుల్లో గంజాయి ప్యాకెట్లు లభ్యం
- ఉన్నతాధికారుల ఆదేశాలతో పోలీసులకు అప్పగింత
- వర్సిటీ విద్యార్థులు కాదంటున్న అధికారులు
- బయటి కళాశాలలకు చెందిన వారంటూ వాదన
- గతంలో గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన ఏయూ సెక్యూరిటీ సిబ్బంది

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయం గంజాయి వినియోగానికి అడ్డాగా మారుతోంది. గతంలో గంజాయి విక్రయిస్తూ సెక్యూరిటీ సిబ్బంది పట్టుబడిన విషయం తెలిసిందే. దీనిపై అప్పట్లో పెద్ద రచ్చే జరిగింది. సదరు సిబ్బందిపై అధికారులు చర్యలు తీసుకోవడంతో అప్పటికి సద్దుమణిగింది. కానీ ఇప్పటికీ వర్సిటీలో గంజాయి విక్రయాలు, వినియోగం జరుగుతున్నట్టు సమాచారం.

తాజాగా గురువారం సాయంత్రం గంజాయి ప్యాకెట్లతో ఏడుగురు విద్యార్థులు వర్సిటీలోని ఓ హాస్టల్‌లో పట్టుబడడంతో కలకలం రేగింది. వర్సిటీ అధికారుల కథనం ప్రకారం...ఓ వసతిగృహంలో ఉంటున్న విద్యార్థుల వద్దకు బయట నుంచి ఏడుగురు విద్యార్థులు వచ్చారు. వారు తిరిగి వెళుతున్న సమయంలో వ్యవహారశైలి భిన్నంగా ఉండడంతో సెక్యూరిటీ సిబ్బంది తనిఖీ చేశారు. ఇద్దరు విద్యార్థుల జేబుల్లో గంజాయి ప్యాకెట్లు లభించడంతో వారిని రిజిస్ట్రార్ కార్యాలయానికి తీసుకువెళ్లారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో వారిని పోలీసులకు అప్పగించి, ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ బయటి నుంచి ఏడుగురు విద్యార్థులు క్యాంపస్‌లోని తమ మిత్రుల వద్దకు వచ్చారన్నారు. వీరిలో ప్రిజంతోపాటు మరో కళాశాలకు చెందిన విద్యార్థులు ఉన్నారని, వీరు హాస్టల్ నుంచి వెళ్లే సమయంలో సెక్యూరిటీ సిబ్బంది తనిఖీ చేయగా గంజాయి దొరికిందన్నారు. దీంతో వెంటనే ... మిగతా 7వ పేజీలో

ఇద్దరు ఏయూ విద్యార్థులే...

గంజాయితో దొరికిన విద్యార్థులంతా బయట కళాశాలలకు చెందినవారని ఏయూ అధికారులు చెబుతుండగా...పోలీసులు మాత్రం ఇద్దరు వర్సిటీ విద్యార్థులు ఉన్నట్టు తేల్చారు. ఆ ఇద్దరు ఏయూలోనే ఎమ్మెస్సీ చదువుతూ శ్రీకృష్ణదేవరాయలు వసతి గృహంలో ఉంటున్నారు. వారి వద్దకే బయట నుంచి మరో ఐదుగురు విద్యార్థులు వచ్చారు. బయట నుంచి వచ్చిన విద్యార్థులు గంజాయి తెచ్చారా? లేక ఏయూలో ఉన్న విద్యార్థుల వద్దే గంజాయి ఉందా?...అన్న విషయం తేలాల్సి ఉంది. వర్సిటీ అధికారులు మాత్రం ఏడుగురూ బయట నుంచి వచ్చిన విద్యార్థులు అని చెబుతుండడం గమనార్హం. ఏయూ విద్యార్థులు లేరని కప్పిపుచ్చుకోవడం వల్ల ప్రయోజనం లేదని, వర్సిటీలోకి గంజాయి ఎలా వస్తుందన్న దానిపై దృష్టి సారించాల్సిన అవసరముందని పలువురు పేర్కొంటున్నారు.

కొండకర్ల రిసార్ట్‌లో అడ్డగోలు వ్యవహారాలు

పార్టీ పేరుతో మద్యం సేవించిన యువకులు

- యువతులతో కలిసి రెయిన్ డ్యాన్స్
- శ్రుతి మించి.. నగ్నంగా డ్యాన్స్ చేయాలని అమ్మాయిలపై ఒత్తిడి
- డయల్ 100కు ఫోన్ చేసిన ఓ యువతి
- అర్ధరాత్రి తరువాత రిసార్ట్‌కు వెళ్లిన పోలీసులు
- అప్పటికే పలువురు పరారీ
- ఇద్దరు యువకులు, నలుగురు యువతులను స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ
- కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేసిన పోలీసులు
- యువతుల వినతి మేరకు కేసు నమోదు చేయలేదని సీఐ వెల్లడి



యువతీ యువకులు పార్టీ చేసుకున్న రిసార్ట్ ఇదే (ఫైల్ ఫొటో)

అచ్యుతాపురం రూరల్, ఫిబ్రవరి 23:

మండలంలోని కొండకర్ల ఆవ సమీపంలో అధికార పార్టీ నాయకుడికి చెందిన ఒక రిసార్ట్‌లో నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు జరుగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండు రోజుల క్రితం కొంతమంది యువతీ యువకులు ఇక్కడ పార్టీ చేసుకున్నారు. మద్యం సేవించి వున్న యువకులు, నగ్నంగా డ్యాన్స్ చేయాలని యువతులను బలవంతంగా చేశారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు రిసార్ట్ వద్దకు వెళ్లారు. అధికార పార్టీ నేతకు చెందిన రిసార్ట్ కావడంతో పార్టీ చేసుకున్న యువతీ యువకులను హెచ్చరించి వదిలేశారు. దీనికి సంబంధించి విశ్వసనీయ వర్గాలు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా వున్నాయి.

అచ్యుతాపురం మండలం కొండకర్ల ఆవ సమీపంలో ఐదు ప్రైవేటు రిసార్టులు వున్నాయి. వీటిపై పోలీసుల నిఘా లేకపోవడంతో కొన్నిసార్లు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్టు స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా వీటిలో ఒక రిసార్టును అధికార వైసీపీకి చెందిన స్థానిక నాయకుడు నిర్వహిస్తున్నారు. గ్రామ పంచాయతీ వ్యవహారాల్లో ఇతను పెత్తనం చేస్తుండడంతో అందరూ 'సూపర్ సర్పంచ్'గా పిలుస్తుంటారు. దీంతో ఈ రిసార్టులో నిబంధనలకు విరుద్ధంగా జరిగే కార్యక్రమాల గురించి పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు అంటుంటారు. ఈ నేపథ్యంలో ఈ నెల 21వ తేదీ బుధవారం రాత్రి సుమారు 20 మంది కలిసి ఇక్కడ పార్టీ ఏర్పాటు చేసుకున్నారు. వీరిలో నలుగురు యువతులు కూడా ఉన్నారు. అబ్బాయిలు అర్ధరాత్రి వరకు పూటుగా మద్యం సేవించారు. రెయిన్ డ్యాన్సులు చేశారు. అయితే మద్యం మత్తులో ఉన్న యువకులు.. నగ్నంగా డ్యాన్స్ చేయాలని యువతులను బలవంతం చేశారు. దీంతో తీవ్రభయాందోళన చెందిన యువతుల్లో ఒకరు డయల్ పోలీసు 100 నంబర్‌కు కాల్ చేశారు. అచ్యుతాపురం స్టేషన్‌కు చెందిన ఇద్దరు పోలీసులు అర్ధరాత్రి తరువాత రిసార్టుకు వెళ్లారు. పోలీసులు వస్తున్నట్టు అప్పటికే సమాచారం రావడంతో పలువురు యువకులు అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు వెళ్లేసరికి ... మిగతా 8వ పేజీలో



పూడిమడక తీరంలో శుక్రవారం సాయంత్రం మొదలైన జాతర సందడి

నేడు మాఘపౌర్ణమి

సముద్ర తీరాల్లో పుణ్యస్నానాలు

పూడిమడక, రేవుపోలవరం ప్రాంతాల్లో పటిష్ట ఏర్పాట్లు

మాఘపౌర్ణమి సందర్భంగా జిల్లాలోని సముద్ర తీరప్రాంతంలో పలుచోట్ల భక్తులు పుణ్యస్నానాలు ఆచరించనున్నారు. ఇందులో భాగంగా అచ్యుతాపురం మండలం పూడిమడకలో శుక్రవారం సాయంత్రమే జాతర ప్రారంభమైంది. భక్తులు రాత్రంతా జాగారం చేసి శనివారం ఉదయం సముద్ర స్నానాలు చేస్తారు. అనంతరం రుక్మిణి సత్యభామ సహిత వేణుగోపాలస్వామిని దర్శించుకుంటారు. ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం, పరవాడ మండలం ముత్యాలమ్మ పాలెం, పాయకరావుపేట మండలం పాల్మన్‌పేట, రాజయ్యపేట, రాజానగరం, గజపతినగరం, పెంటకోట, నక్కపల్లి మండలం బోయపాడు, రాజయ్యపేట, రాంబిల్లి మండలం వాడపాలెం వద్ద సముద్ర తీరాల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు. పూడిమడక, రేవుపోలవరం ప్రాంతాలకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు అధికారులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. -7లో

ఇంటర్ బోర్డు వివక్ష

జంబ్లింగ్ పేరుతో నిబంధనలకు తూట్లు

- అచ్యుతాపురంలో నాలుగు జూనియర్ కాలేజీలు...
- మూడు కళాశాలల విద్యార్థులకు స్థానికంగానే పరీక్షలు
- అచ్యుత కళాశాల విద్యార్థులకు మాత్రం 20 నుంచి 28 కి.మీ. దూరంలోని కేంద్రాలు కేటాయింపు
- దివ్యాంగ విద్యార్థులపై జాలి చూపని అధికారులు



ఇంటర్ పరీక్షలకు హాజరుకానున్న దివ్యాంగ విద్యార్థులు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 23:

ఇంటర్ పరీక్షలకు కేంద్రాల కేటాయింపులో బోర్డు అధికారులు వివక్ష చూపిస్తున్నారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో నాలుగు జూనియర్ కళాశాలలు ఉండగా... మూడు కళాశాలల విద్యార్థులకు వీటిల్లో కాలేజీని పరీక్షా కేంద్రంగా కేటాయించారు. కానీ మరో కళాశాల విద్యార్థులకు మాత్రం 20 నుంచి 28 కిలోమీటర్ల దూరంలో కాలేజీలను పరీక్షా కేంద్రాలుగా కేటాయించారు. వీరిలో దివ్యాంగ విద్యార్థులపై కూడా ఉన్నారు. వివరాల్లోకి వెళితే...

అచ్యుతాపురంలో నాలుగు జూనియర్ కాలేజీలు ఉన్నాయి. వచ్చే నేల ఒకటో తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. మాస్ కాపీయింగ్, ఇతర అక్రమాలకు తావివ్వకూడదన్న ఉద్దేశంతో బోర్డు అధికారులు జంబ్లింగ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. విద్యార్థులు చదువుతున్న కళాశాలలో కాకుండా చుట్టుపక్కల వున్న వేరే కళాశాలలను పరీక్షా కేంద్రాలుగా కేటాయిస్తున్నారు. ఈ మేరకు 15 కిలోమీటర్ల పరిధిలో వున్న కాలేజీలను మాత్రమే పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేయాలి. కాగా అచ్యుతాపురంలో నాలుగు జూనియర్ కళాశాలలు ఉండగా, మూడు కళాశాలల విద్యార్థులకు వీటిల్లో ఒక కాలేజీని పరీక్షా కేంద్రంగా ఎంపిక చేశారు. అయితే అచ్యుత జూనియర్ కాలేజీ విద్యార్థులకు ఇక్కడ పరీక్షా కేంద్రం కేటాయించలేదు. జంబ్లింగ్ పేరుతో 20 కిలోమీటర్ల దూరంలో వున్న ఎలమంచిలి దరి కొక్కిరాపల్లిలో, 28 కిలోమీటర్ల దూరంలో వున్న కశింకోట మండలం తాళ్లపాలెంలోని కాలేజీలను పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేశారు. అచ్యుత కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి సుమారు 300 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో దివ్యాంగ (అంధ, బదిర, మూగ, శరీర వైకల్యం కలిగిన) విద్యార్థులు ఐదుగురు ... మిగతా 8వ పేజీలో

సార్వత్రిక ఎన్నికలకు పక్కాగా ఏర్పాట్లు

చిన్నపాటి పొరపాటుకు కూడా తావివ్వొద్దు

- ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో మోడల్ పోలింగ్ బూత్ ఏర్పాటు
- ఓటింగ్, పోలింగ్ కేంద్రాలపై ఓటర్లకు అవగాహన కల్పించాలి
- ఎన్నికల అధికారులకు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశం
- జిల్లాలో పోలింగ్ ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర సీఈవోకు వివరాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, అధికారులు

అనకాపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎన్నికల ముందస్తు ఏర్పాట్లపై నోడల్ అధికారులు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్వోలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పోలింగ్ సందర్భంగా చిన్నపాటి పొరపాటుకు కూడా అవకాశం ఇవ్వకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. దివ్యాంగులు, వృద్ధులు ఇబ్బంది పడకుండా ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంపులు తప్పనిసరిగా వుండాలని స్పష్టం చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మోడల్ (నమూనా) పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈవీఎంల ద్వారా ఓటు వేసే విధానం, ఓటు ఏ పోలింగ్ బూత్‌లో వుందో తెలుసుకోవడం వంటి వాటిపై ఓటర్లకు అవగాహన కల్పించాలని కలెక్టర్ చెప్పారు. సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు, అవసరమైన వాహనాలు, సామగ్రి, పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ, నిఘా కార్యక్రమాలు, సమాచార పారదర్శకత మొదలైన అంశాలను పోలింగ్ అధికారులు లోతుగా పరిశీలించుకోవాల్నారు.

అంతకుముందు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ముఖేశ్‌కుమార్ మీనా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఓటరు జాబితాల్లో మార్పులు, చేర్పులు, ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్ల గురించి వివరించారు. ఎన్నికల సిబ్బంది నియామకం, పోలింగ్ ... మిగతా 8వ పేజీలో

అకేషియా కర్రలు స్వాధీనం

మూడు లారీలు సీజ్

రావికమతం,ఫిబ్రవరి 24: ఎటువంటి అనుమతులు లేకుండా తట్టబంద తూనిక కాటా వద్ద నుంచి అక్రమంగా తరలించేందుకు సిద్ధం ఉంచిన మూడు లారీల అకేషియా కర్రలను అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో ఎం.సోమసుందరం శుక్రవారం దాడులు చేసి పట్టుకున్నారు. మండలం నుంచి పెద్ద ఎత్తున అకేషియా కలపను ఎటువంటి అనుమతులు లేకుండా అధికార పార్టీకి చెందిన వారు తరలిస్తున్నట్టు డీఎఫ్‌వో కార్యాలయానికి పలు ఫిర్యాదులు అందాయి. దీంతో సిబ్బందితో కలసి దాడి చేశారు. తట్టబందకు చెందిన రాజాన



అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ సీజ్‌చేసిన అకేషియా కర్రల లారీలు

చిన్నంనాయుడుకు సుమారు 50 టన్నుల అకేషియా కర్రలను, వాటిని తరలిస్తున్న లారీలను సీజ్‌చేసి ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

పేకాట శిబిరంలో కత్తితో దాడిపై పోలీసుల ముమ్మర దర్యాప్తు

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 23: అనకాపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోపాలపురం శివారు తోటల్లో పేకాట శిబిరం వద్ద బుధవారం చోటు చేసుకున్న కత్తిపోటు దాడి ఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఈ ఘటనలో గాయపడిన శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఘటనలో ఎంతమంది పాల్పడ్డారు? ఏమి జరిగింది.? వివాదం ఎలా ప్రారంభమైందనే అంశాల పై లోతుగా ఆరా తీస్తున్నట్టు రూరల్ పోలీసులు తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి గడ్డి ట్రాక్టర్ తొట్టె దగ్ధం


దగ్ధమవుతున్న ట్రాక్టర్ తొట్టి

లంకెలపాలెం, ఫిబ్రవరి 23: విద్యుత్ తీగలు తగలడంలో ఎండు గడ్డి ట్రాక్టర్ తొట్టె దగ్ధమైంది. డ్రైవర్ చాకచక్యంగా ట్రాక్టర్ ఇంజన్ నుంచి తొట్టిని వేరు చేయడంతో గడ్డితోపాటు తొట్టి కాలి బుడిదైంది. ఈ ఘటన మండలంలోని గండివానిపాలెంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించి పరవాడ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలి లావున్నాయి. శ్రీకాకుళం జిల్లా రాజాం నుంచి గడ్డి లోడుతో ట్రాక్టర్ పెదముషిడివాడకు బయలుదేరింది. గండివానిపాలెం వద్దకు వచ్చేసరికి పూర్తిగా చీకటి పడింది. దీంతో ప్రధాన రహదారిపై గల విద్యుత్ తీగలు గడ్డికి తగడంతో మంటలు అంటుకున్నాయి. క్షణాల్లో మంటలు ట్రాక్టర్ చుట్టూ వ్యాపించాయి. దీంతో డ్రైవర్ దశరథరావు వెంటనే నిలుపుదల వేసి ట్రాక్టర్ ఇంజన్‌ను తొట్టి నుంచి వేరు చేశాడు. స్థానికుల సాయంతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ వీలు పడలేదు. తొట్టి పూర్తిగా మంటల్లో చిక్కుకొని కాలి బుడిదైంది. మంటలు టైరుకు వ్యాపించడంతో పెద్ద ఎత్తున శబ్దంతో పేలిపోయాయి. ఈ క్రమంలో స్థానికులు పరుగులు తీశారు. ఎలాంటి ప్రాణాపాయం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పరవాడ పోలీసులు సంఘటనా స్థలిని పరిశీలించి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు గ్రావెల్ ట్రాక్టర్ల సీజ్

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 23: మండలంలోని దార్లపూడి వద్ద అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు తహసీల్దార్ జయలక్ష్మి శుక్రవారం తెలిపారు. దార్లపూడి సమీపంలో ఉన్న పోలవరం కాలువకు చెందిన గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తునట్టు అందిన సమాచారం మేరకు ఆర్‌ఐ వినయ్ దాడి చేసి రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్టు చెప్పారు.

50 మద్యం బాటిళ్లతో ఒకరి అరెస్టు

నాతవరం, ఫిబ్రవరి 23: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ రామారావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. నాతవరం మండలం నుంచి గొలుగొండ మండలం చోద్యం గ్రామానికి లింగంపేటకు చెందిన ఎ.శంకరయ్య యాభై మద్యం బాటిళ్ల అక్రమంగా తరలిస్తుండగా సమాచారం అందిందన్నారు. ఈ మేరకు సిబ్బందితో దాడి జరిపి మాధవనగరం జంక్షన్‌లో పట్టుకుని, అరెస్టు చేసినట్టు చెప్పారు.

అంతర్రాష్ట్ర నేరస్తుడి అరెస్టు

» రూ. 13 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం

మహారాణిపేట, ఫిబ్రవరి 23: పగటి పూట తాళాలు వేసిన ఇళ్లలోకి ప్రవేశించి చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగ కామేపల్లి శ్రీనివాస్‌ను అరెస్టు చేసినట్టు డీసీపీ (క్రైమ్) పి.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం పోలీసు కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ఈ నెల 10న మధురానగర్‌లో నివాసముంటున్న నూలు వరలక్ష్మి, సూర్యప్రసాద్ ఇంట్లో వారు లేని సమయంలో చోరీ జరిగి రెండు తులాల బంగారు ఆభరణాలు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేశారు. స్థానిక ఆర్టీసీ కాంపెక్స్ సమీపంలోని పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు ప్రాంతానికి చెందిన కామేపల్లి శ్రీనివాస్ అనే పాత నేరస్తుడిని అదుపులోకి తీసుకొని విచారించారు. నిందితుడు నేరాన్ని అంగీకరించాడు. దీనితో పాటు గతంలో పలు నేరాలకు పాల్పడినట్టు తేలింది. మైసూర్, గోవా, చెన్నై తదితర ప్రాంతాలలో దొంగతనాలు చేస్తూ జల్సాగా తిరిగేవాడు. ఈ నేపథ్యంలో సుమారు రూ. 13 లక్షల విలువైన 249 గ్రాముల బంగారాన్ని, 660 గ్రాముల వెండితో పాలు పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు, నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్టు డీసీపీ వెంకటేశ్వరరావు తెలిపారు.

ఏయూలో గంజాయ్!

... 5వ పేజీ తరువాయి

పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కాగా వారిలో ఏయూ విద్యార్థులు ఎవరూ లేరని ఆయన వెల్లడించారు.

గుట్టుగా విక్రయాలు

వర్సిటీలో పలువురు విద్యార్థులు గంజాయి విని యోగానికి అలవాటు పడ్డారని సమాచారం. క్యాంపస్‌లోని హాస్టల్‌కు బయటి నుంచి ఏడుగురు విద్యార్థులు వచ్చి గంజాయి సేవించి వెళుతున్నారంటే..ఇక్కడి విద్యార్థులకు అలవాటు లేకుండానే ఇదంతా జరిగిందని నమ్మలేని పరిస్థితి. క్యాంపస్‌లోని విద్యార్థుల వ్యవహారాన్ని వర్సిటీ అధికారులు బయటపెట్టడం లేదు... కానీ అంతర్గతంగా వారిపైనా విచారణ సాగుతోందని చెబుతున్నారు. ఏయూ చుట్టుపక్కల అనేక దుకాణాల్లో గంజాయి విక్రయాలు సాగుతున్నాయంటున్నారు. విద్యార్థులకు గంజాయిని సరఫరా చేయడానికి కొన్ని బ్యాచ్‌లు ఉన్నాయని, ఈ విషయంలో సెక్యూరిటీ సిబ్బంది కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తుంటారని చెబుతున్నారు. అందుకు వారికి కొంత మొత్తం అందుతుందంటున్నారు. గంజాయి విక్రయాలపై ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందని క్యాంపస్‌లోని విద్యార్థులే పేర్కొంటున్నారు.

కఠినంగా వ్యవహరిస్తేనే...

బయటి విద్యార్థులు క్యాంపస్‌లోకి గంజాయి తీసుకుని వచ్చారంటే సెక్యూరిటీ ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మధ్యాహ్నం వేళ క్యాంపస్‌తో సంబంధం లేని వారు బ్యాగులతో సహా వర్సిటీలోకి వెళుతున్నా సెక్యూరిటీ సిబ్బంది తనిఖీ చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. క్యాంపస్‌లోకి అడుగుపెట్టాలంటే ఐడీ కార్డులు తప్పనిసరి చేస్తూ గతంలో అధికారులు ఆదేశాలు జారీచేశారు. వాటిని సక్రమంగా పాటించకపోవడం వల్లే తాజా ఘటన చోటుచేసుకుందంటున్నారు. ఈ తరహా వ్యవహారాలకు పాల్పడుతున్న విద్యార్థులు ఇంకెంతమంది క్యాంపస్‌కు వచ్చి, వెళుతున్నారోననే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. తాజా ఘటన నేపథ్యంలో మరింత కఠినంగా ఉంటామని వర్సిటీ అధికారులు చెబుతున్నారు. ఇకపై వర్సిటీలోకి వచ్చే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసేలా ఆదేశాలు జారీచేశామని, వసతి గృహాలకు బయటివారు రాకుండా చర్యలు తీసుకుంటామని రిజిస్ట్రార్ స్టీఫెన్ పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గుట్టుగా గంజాయి వినియోగం సాగుతోంది. గతంలో సెక్యూరిటీ సిబ్బందే గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన విషయం తెలిసిందే. దీనిపై అప్పట్లో పెద్ద రచ్చే జరిగింది. సదరు సెక్యూరిటీ సిబ్బందిపై అధికారులు చర్యలు తీసుకున్నారు. కానీ, ఇప్పటికీ యూనివర్శిటీలో గుట్టుగా గంజాయి విక్రయాలు, వినియోగం సాగు తున్నాయని చెబుతుంటారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

మాఘ పౌర్ణమి జాతరకు ఏర్పాట్లు పూర్తి


రేవుపోలవరంలో సముద్రతీరం పక్కనే కొండపై ఉన్న లక్ష్మీ మాధవ స్వామి వారి ఆలయం


అడ్డరోడ్డులో నక్కపల్లి సర్కిల్ కార్యాలయం వద్ద పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న సీఐ అప్పన్న

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 23:
మాఘ పౌర్ణమి జాతరకు మండలంలోని రేవుపోలవరం సముద్రతీరం వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సముద్ర స్నానం ఆచరించిన భక్తులు పక్కనే కొండపై ఉన్న లక్ష్మీ మాధవస్వామిని దర్శించుకొని, పూజలు చేస్తారు. శుక్రవారం రాత్రి నుంచి ప్రారంభం కానున్న ఈ జాతరకు శనివారం సాయంత్రం వరకు లక్ష మందికి వరకు భక్తులు తరలి వస్తారని నిర్వాహకులు అంచనా వేశారు. శుక్రవారం తహసీల్దార్ జయలక్ష్మి, డీటీ శ్యామ్ సముద్రతీరం వద్ద చేపట్టిన పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పుణ్యస్నానం ఆచరించడానికి వచ్చే భక్తులకు తాగునీటి సదుపాయంతో పాటు మెడికల్ క్యాంపు, స్త్రీలు బట్టలు మార్చుకోవడం కోసం నాలుగు గుడారాలు ఏర్పాటు చేసినట్టు డీటీ శ్యామ్ తెలిపారు. ముగ్గురు సీఐలు, పది మంది ఎస్ఐలు, వంద మంది సిబ్బందితో పాటు 25 మంది గజ ఈతగాళ్లను సిద్ధం చేసినట్టు సీఐ అప్పన్న చెప్పారు. బందోస్తుకు వచ్చిన పోలీస్ సిబ్బందికి సీఐ అప్పన్న పలు సూచనలు చేశారు. సముద్రతీరంలో ప్రమాదకరమైన ప్రదేశాల్లో పోలీసులు ఎక్కడికక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రికి సముద్రతీరం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు.

జాతరకు 70 మంది పోలీస్ సిబ్బంది

పరవాడ, ఫిబ్రవరి 23:
మాఘ పౌర్ణమి పురస్కరించుకుని ముత్యాలమ్మపాలెం తీరంలో శనివారం భక్తులు చేయనున్న సముద్ర స్నానాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు 70 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్టు పరవాడ సీఐ బాలసూర్యారావు తెలిపారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు బందోబస్తు కొనసాగుతుందన్నారు. స్నానాలకు వచ్చే భక్తులు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తమ వాహనాలను పార్కింగ్ స్థలంలో నిలుపుకోవాలన్నారు. భక్తులు అధిక మొత్తంలో నగదు, బంగారం ఆభరణాలు ధరించవద్దని సూచించారు. గజ ఈతగాళ్లను నియమించామన్నారు. డీఎస్పీ కేవీ సత్యనారాయణ పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ

ముత్యాలమ్మపాలెం తీరంలో శనివారం మాఘ స్నానాల కోసం వచ్చే భక్తులకు ఉదయం ఏడు గంటల నుంచి అల్పాహారం పంపిణీ చేయనున్నట్టు తెలుగు యువత మండల అధ్యక్షుడు పైలా చినఅక్కునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆర్థిక సాయంతో ఐదువేల మంది భక్తులకు అల్పాహారం అందజేస్తామన్నారు.

పూడిమడక జాతర ప్రారంభం

» తీరంలో ఉత్తరాంధ్ర జిల్లాల కబడ్డీ పోటీలు నిర్వహణ

» అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు


పూడిమడక బీచ్‌లో కబడ్డీ ఆడుతున్న దృశ్యం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 23: మాఘపౌర్ణమి సందర్భంగా పూడిమడకలో శుక్రవారం సాయంత్రం నుంచి జాతర ప్రారంభమైంది. శుక్రవారం రాత్రి జగారం చేసి శనివారం ఉదయం సముద్ర స్నానాలు చేసిన అనంతరం తీరంలో గల రుక్మిణి సత్యభామ సహిత వేణుగోపాల స్వామిని దర్శించుకుంటారు. అయితే శుక్రవారం రాత్రంతా భక్తులు పూడిమడక సముద్ర తీరంలో గడుపుతారు. ఈ సందర్భంగా తీరంలో భారీగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా తీరంలో రంగుల రాట్నాలు, జైంట్ వీల్ వంటివి ఏర్పాటు చేశారు. తప్పెట గుళ్లు, తోడపెద్దులు, చిటికెల భజన, జంగమ దేవర్లు శుక్రవారం రాత్రికి పూడిమడక చేరుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టామని డీఎస్పీ కేవీ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన పూడిమడక తీరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పూడిమడక సచివాలయ ప్రాంగణంలో పోలీసులకు పలు సూచనలు చేశారు. పోలీసులను నాలుగు విభాగాలుగా విభజించి ట్రాఫిక్ కంట్రోల్, వేణుగోపాల స్వామి ఆలయం వద్ద, సముద్ర తీరం వద్ద ఉండేలా పోలీసులను విభజించారు. అలాగే గజ ఈతగాళ్లకు ప్రత్యేక బనియన్లు ఇచ్చి తీరం వద్ద ఉంచారు. ఎనిమిది మర పడవలని కూడా తీరం వద్ద అందుబాటులో ఉంచామని ఆయన తెలిపారు. పూడిమడక బీచ్ బాయిస్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల కబడ్డీ పోటీలను ఏర్పాటు చేశారు. మూడు జిల్లాల నుంచి 15 జట్లు పాల్గొన్నారు. విజేతలకు వరుసగా రూ.30, రూ.20, రూ.10 వేలు చొప్పున బహుమతులు ప్రకటించారు. పూడిమడక ఉన్నత పాఠశాల నుంచి సముద్ర తీరం వరకు భారీ లైటింగ్ ఏర్పాటు చేశారు.

పాఠశాలలో పెళ్లి వేడుక

» ఉపాధ్యాయులను ఒక నేత బెదిరించి వేదిక ఏర్పాటు


కొండకర్ల ఉన్నత పాఠశాలలో వివాహనికి వేసిన సెట్

అచ్యుతాపురం, ఫిబ్రవరి 23: పాఠశాల వివాహ వేదికయ్యింది. ఉపాధ్యాయులను బెదిరించి ఒక నాయకుడు తమ బంధువుల వివాహానికి పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేయించాడు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని కొండకర్ల ఒక నాయకుని బంధువుల వివాహం జరుగుతుంది. ఈ పెళ్లిని పాఠశాల ఆవరణలో వేదిక ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రికి వివాహం.. కాని గురువారం నుంచి పాఠశాల ఆవరణలో పెళ్లి మండపం సెట్, భారీ స్థాయిలో స్వాగత ద్వారాలు, విందు భోజనాలకు టెంట్‌లు, విద్యుత్ దీపాలంకరణలు చేశారు. దీంతో గురు, శుక్రవారాల్లో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాఠశాల ఆవరణలో ఇటువంటివి జరపకూడదని ఉపాధ్యాయలు ఎంత చెప్పినా ఆ నాయకుడు వారిని బెదిరించి మరీ భారీ సెట్‌లు వేశారు. దీంతో రెండు రోజుల పాటు విద్యార్థులకు ఉదయం పూట ప్రార్థనలు జరగలేదు. అంతేకాక రెండు రోజుల పాటు విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నత్తనడకన 'జల్ జీవన్' పనులు!

» ఏడాది క్రితం నాతవరం మండలంలో ప్రారంభం
» రెండు పంచాయతీలలో మాత్రమే పూర్తి
» కొన్నిచోట్ల తవ్వకాలు చేపట్టి నిలిపివేసిన కాంట్రాక్టర్లు
» సిమెంటు రోడ్లు పాడవ్వడంతో ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు


మర్రిపాలెంలో నత్తనడకన సాగుతున్న పనులు


తవ్వకాలు చేపట్టడంతో శృంగవరంలో పాడైన సిమెంట్ రోడ్డు

నాతవరం, ఫిబ్రవరి 23:
జల్‌జీవన్ మిషన్ పనులు నత్తనడకన సాగుతుండడంతో మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు, కొన్నిచోట్ల తాగునీటి ట్యాంకుల నిర్మాణానికి రూ.27 కోట్లు మంజూరయ్యాయి. గత ఏడాది జనవరిలో మండలంలోని ప్రతి పంచాయతీలో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. సందరకోట, మాసయ్యపేట పంచాయతీలలో మాత్రమే ఈ కుళాయిలు పనులు పూర్తికాగా, మిగిలిన పంచాయతీలో నెలల తరబడి నత్తనడకన సాగుతున్నాయి. ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు నిమిత్తం సిమెంట్ రోడ్డు పక్కనే మిషన్‌తో గోతులు తవ్వారు. అయితే వెంటనే పనులు పూర్తిచేయకుండా వదిలేస్తున్నారు. దీంతో రాత్రి వేళలలో విద్యుత్ సరఫరా లేని సమయాల్లో ఆయా గోతులలో పడి పలువురు గాయాలకు గురవుతున్నారు. అలాగే శృంగవరం వంటి కొన్ని పంచాయతీలలో కుళాయిల ఏర్పాటు కోసం బాగా ఉన్న సిమెంట్ రోడ్లను మిషన్ సహాయంతో తవ్వేసి ఆ తర్వాత సరిగా కప్పకుండా వదలి వెళ్లిపోతున్నారు. ఫలితంగా సిమెంట్ రోడ్లు పాడవుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. అలాగే మన్యపురట్ల, పీఎన్‌డీ పాలెం, ఎస్‌బీపట్నం, రామన్నపాలెం తదితర పంచాయతీలలో ఈ పనులు చేసే కాంట్రాక్టర్లు నిధులు మంజూరు కాలేదని పనులను మధ్యలో నిలిపివేసి వెళ్లిపోయినట్టు పలువురు తెలిపారు. దీంతో ఆయా గ్రామాల వారికి సమస్యలు తప్పడం లేదు. ఇలా కాంట్రాక్టర్లు మధ్యలో పనులు వదలి వెళ్లిన పంచాయతీలలో కొత్తగా కాంట్రాక్టర్లను ఏర్పాటు చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెపుతున్నారు. సుమారు ఏడాది నుంచి మండలంలో ఇంటింటి కుళాయిల ఏర్పాటు పనులు నెమ్మదిగా జరుగుతుండడం వల్ల సిమెంట్ రోడ్ల పక్కన తవ్విన గోతులతో ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఇంటింటి కుళాయిల ఏర్పాటు పనులు త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు తవ్వి వదిలేసిన సిమెంటు రోడ్లకు మరమ్మతులు చేపట్టాల్సిందిగా ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గంజాయి సేవించిన ఏయూ విద్యార్థుల అరెస్టు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 23: ఏయూలో గంజాయి సేవిస్తున్న ఏడుగుర్ని మూడో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో ఇద్దరు ఎమ్మెస్సీ చదువుతుండగా ఐదుగురు వారి స్నేహితులు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏయూలో ఎమ్మెస్సీ చదువుతున్న విద్యార్థులు సైన్స్ కళాశాలకు చెందిన శ్రీకృష్ణదేవరాయ వసతిగృహంలో ఉంటున్నారు. వారికి బయట ఉన్న ఐదుగురితో స్నేహం ఏర్పడింది. వారంతా మాదకద్రవ్యాలకు బానిసై వసతి గృహంలో గంజాయి, సిగిరెట్లు సేవిస్తుంటారు. ఈక్రమంలో గురువారం రాత్రి వసతి గృహంలోని వారి రూమ్‌లో ఏడుగురూ సిగిరెట్లు తాగుతుండగా హాస్టల్ సెక్యూరిటీ గార్డు గమనించి, చీఫ్ సెక్యూరిటీ అధికారికి సమాచారమిచ్చాడు. వెంటనే ఆయన తనిఖీ చేయగా గంజాయి కలిపిన సిగిరెట్లు, 5 గ్రాముల గంజాయి ప్యాకెట్ లభ్యమయ్యాయి. ఈమేరకు ఆయన మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

వాడపాలెం తీరంలో ఏర్పాట్లు పరిశీలించిన సీఐ

రాంబిల్లి, ఫిబ్రవరి 23: రాంబిల్లి శివారు వాడపాలెం సముద్రతీరంలో ఈ నెల 24న జరగనున్న మాఘ పౌర్ణమి జాతర సందర్భంగా సీఐ లక్ష్మణరావు ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాడపాలెం తీరంలో మాఘస్నానాలు ఆచరించే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. తీరం వెంబడి పోలీస్ గస్తీతో పాటు గజ ఈతగాళ్లను కూడా ఏర్పాటు చేశామన్నారు. స్నానాలు ఆచరించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో భక్తులు స్నానాలు చేయకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు సీఐ లక్ష్మణరావు తెలిపారు.

జిల్లాలో 90 వేల మొక్కలు ప్లాంటేషన్


రోడ్డు పక్క మొక్కలు పరిశీలించేందుకు వచ్చిన డీఎఫ్‌వో లక్ష్మణ్

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 23 : జిల్లాలో ఈ ఏడాది 90 వేల మొక్కలను నాటుతున్నట్టు డీఎఫ్‌వో జి.లక్ష్మణ్ తెలిపారు. మండలంలోని కేబీ రోడ్డుకు ఇరుపక్కలా నాటిన మొక్కలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో 50 కిలోమీటర్ల మేర 50 వేల మొక్కలను, బ్లాక్ ప్లాంటేషన్ కింద 40 వేల మొక్కలను నాటుతున్నామన్నారు. బ్లాక్ ప్లాంటేషన్ కింద ప్రభుత్వ కార్యాలయాలు, మార్కెట్ యార్డుల్లో తెల్లమద్ది, వేగిసా తదితర రకాల మొక్కలను నాటుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చోడవరం రేంజ్ ఆఫీసర్ బి.గౌరీసు, రావికమతం, చోడవరం సెక్షన్ ఆఫీసర్లు ఓఎస్ఎన్ మూర్తి, జి.రమణారావు, వన సేవకుడు జి.ముత్యాలు పాల్గొన్నారు.

నేడు వైశ్యరాజు జ్యూయలర్స్ ప్రారంభం

అనకాపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సత్యనారాయణ థియేటర్‌కు సమీపంలో శనివారం ఉదయం 11 గంటల 46 నిమిషాలకు వైశ్యరాజు జ్యూయలర్స్ నూతన బ్రాంచిని ప్రారంభిస్తున్నట్టు యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి ప్రజలకు వైశ్యరాజు జ్యూయలర్స్ చేరువ చేసేందుకు నూతన బ్రాంచి ప్రారంభిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ నూతన బ్రాంచి ప్రారంభోత్సవానికి ప్రతిఒక్కరూ హాజరై వ్యాపారాభివృద్ధికి సహకరించాలని కోరారు.

గ్రూప్-2 స్క్రీనింగ్ టెస్ట్‌కు పటిష్ఠ బందోబస్తు

» ఎస్పీ కేవీ మురళీకృష్ణ



అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 23: జిల్లాలో వచ్చే ఆదివారం జరగనున్న ఏపీపీఎస్సీ గ్రూప్-2 స్క్రీనింగ్ రాత పరీక్షకు పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్పీ కేవీ మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 33 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఆయా కేంద్రాల్లో 10,627 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారన్నారు. ఉదయం తొమ్మిదిన్నర గంటల నుంచి పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులను కేంద్రాల లోపలకు అనుమతిస్తామన్నారు. 10.15 గంటలకు ఒక నిముషం దాటినా పరీక్షా కేంద్రంలోకి అనుమతించమన్నారు. పరీక్ష పూర్తయ్యే వరకు పరీక్షా కేంద్రం నుంచి బయటకు వెళ్లేందుకు అనుమతించమన్నారు. రాత పరీక్ష రాసే అభ్యర్థులు హాల్ టికెట్‌లో పేర్కొన్న నియమ నిబంధనలను పాటించాలన్నారు. సెల్‌ఫోన్లు, క్యాలీక్యూలేటర్లు, బ్లూటూత్, స్మార్ట్ వాచీలు వంటి ఎలక్ట్రానిక్స్ పరికరాలు పరీక్షా కేంద్రాలకు అనుమతించమన్నారు. జిల్లా వ్యాప్తంగా జరిగే ఈ పరీక్షా కేంద్రాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అభ్యర్థులు ఎటువంటి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినట్టు గుర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.

నర్సీపట్నానికి చెందిన డాక్టర్‌కు బంగారు పతకం

» రేడియాలజీ విభాగంలో టాపర్‌గా నిలిచిన రమ్యాదేవి
» మహారాష్ట్ర హెల్త్ వర్సిటీ స్నాతకోత్సవంలో పురస్కారం ప్రదానం


పతకం అందుకున్న డాక్టర్ రమ్యాదేవి

నర్సీపట్నం, ఫిబ్రవరి 23: రేడియాలజీ విభాగంలో నర్సీపట్నానికి చెందిన డాక్టర్ అల్లు రమ్యాదేవి మహారాష్ట్ర హెల్త్ యూనివర్సిటీ స్టేట్ టాపర్‌గా నిలిచి బంగారు పతకాన్ని సాధించారు. ఈ మేరకు శుక్రవారం నాసిక్‌లో జరిగిన వర్సిటీ 23వ స్నాతకోత్సవంలో ఆ రాష్ట్ర గవర్నర్ రమేష్ బైస్, ఆరోగ్య శాఖ మంత్రి హసన్ ముష్రిఫ్, వైస్ చాన్సలర్ డాక్టర్ నితిన్ గంగనే, లెఫ్టినెంట్ జనరల్ డాక్టర్ మాధురీ కనిట్కర్‌ల చేతుల మీదుగా ఆమె బంగారు పతకం, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. డాక్టర్ రమ్యాదేవి తండ్రి పెదబొడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా, తల్లి రత్నకుమారి నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రిలో హెడ్ నర్సుగా విధులు నిర్వహిస్తున్నారు. భర్త డాక్టర్ స్నేహిత్‌రెడ్డి ఎండీ పెడియాట్రిక్స్ పూర్తి చేసి స్పెషలైజేషన్ కోర్సు చేస్తున్నారు.

1న ప్రధాని రాక?

ఏయూలో బహిరంగ సభ.. ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా అధికారులు


అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖపట్నం, ఫిబ్రవరి 23: వివిధ కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులను ప్రారంభించేందుకు ప్రధాని నరేంద్రమోదీ మార్చి ఒకటో తేదీన నగరానికి రానున్నట్టు సమాచారం. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బహిరంగ సభలో పాల్గొంటారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శుక్రవారం పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యనార్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, ఏడీసీ కేఎస్ విశ్వనాథన్, హెచ్‌పీసీఎల్ ఉన్నతాధికారులతో కలిసి ఏయూ మైదానాన్ని పరిశీలించారు. ప్రధాని పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బలమైన బారికేడ్లు నిర్మించాలని, నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని, తాగునీటి వసతి, పారిశుధ్య నిర్వహణ చేపట్టాలన్నారు. ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలోని హెలీప్యాడ్‌ను పరిశీలించారు. అనంతరం మైదానంలో చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ ఈడీలు రాజీవ్ గోయల్, అభిషేక్ త్రివేది, సురేంద్రగుప్త, సీజీఎం (హెచ్‌ఆర్) కిరణ్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం


తుమ్మపాల సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న అమర్‌నాథ్

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 23 : మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శుక్రవారం ప్రారంభించారు. సీహెచ్‌ఎన్ అగ్రహారం, మార్టూరు, మాకవరం, తుమ్మపాల గ్రామాల్లో నిర్మించిన సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ గ్రామాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రధానంగా వేసవి సమీపిస్తుండడంతో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ గొర్లి సూరిబాబు, నాయకులు మలసాల భరత్, పీలా బుజ్జి, పంచదార్ల కన్నారావు, బొండా అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు తరాల కోసం చంద్రబాబు సీఎం కావాలి

» మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 23 : భవిష్యత్తు తరాల కోసం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. యువతకు ఉద్యోగ కల్పనలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రానికి వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన పరిశ్రమలు, పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టిన వెంటనే యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ప్రతి నెలా మూడువేల రూపాయలు నిరుద్యోగ భృతిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సందిన సునీల్, మరపురెడ్డి సత్యనారాయణ, చందక నరసింగరావు, తలారి కాశీనాయుడు, కరణం పవన్‌కుమార్, మువ్వల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎలమంచిలిలో కొళాయిలు బంద్

ఎలమంచిలి, ఫిబ్రవరి 23 : మునిసిపాలిటీకి తాగునీటి సరఫరా చేసే ప్రధాన నీటి పథకం వద్ద మరమ్మతు పనుల కారణంగా శనివారం కొళాయిల ద్వారా తాగునీటిని నిలిపివేస్తున్నట్టు మునిసిపల్ మేనేజరు ప్రభాకరరావు తెలిపారు. ఎస్.రాయవరం మండలం సోముదేవునిపల్లి తాగునీటి పథకం పంపుహౌస్ మెయింటెన్స్ పనులు జరుగుతున్నందున నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ కారణంగా 4వ వార్డు నుంచి 19, 24 వార్డుల కొళాయిల ద్వారా నీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు. ఈ వార్డుల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామన్నారు.

ఘనంగా సీతారాముల తీర్థం

రాంబిల్లి, ఫిబ్రవరి 23 : మండలంలోని చినకలవలాపల్లిలో శుక్రవారం సీతారాములు, అభయాంజనేయ స్వామివారి తీర్థం ఘనంగా జరిగింది. సర్పంచ్ వై. శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు వై. నారాయణరెడ్డి, మూలయ్యరెడ్డి, చినచ్చన్న, వై.మర్నియరెడ్డి, జల్లి సత్తిరెడ్డి, గ్రామ యువకుల ఆధ్వర్యంలో ఈ వేడుకను నిర్వహించారు. స్థానికులే కాకుండా సమీప గ్రామాలకు చెందిన భక్తులు సీతారాములు, అంజనేయస్వామివార్లను దర్శించి పూజలు చేశారు. ప్రత్యేక భజనలు, చిడతలు, తప్పెడుగుళ్ల కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా ముగ్గులు పోటీలు, డాన్స్‌పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు.

26న ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో జాబ్‌మేళా

సబ్బవరం, ఫిబ్రవరి 23 : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ఈనెల 26వ తేదీన నిరుద్యోగులు కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ బి.శంకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీజీ గోపాలకృష్ణన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో 27 ఏళ్ల లోపు వయస్సు గల ఎంఎస్సీ(కెమిస్ట్రీ), బీఎస్సీ(కెమిస్ట్రీ) 2020, 21, 22, 23 సంవత్సరాల్లో డిగ్రీ ఉతీర్ణులై ఉన్న నిరుద్యోగ యువకులకు (పురుషులు) డిపార్‌మెంట్ ఆఫ్ స్కిల్స్ ట్రైనింగ్, గవర్నమెంట్ ఆఫ్ ఏపీ, హెటిరో డగ్స్ వారు సంయుక్తంగా ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నారన్నారు. ఆసక్తి కలగిని యువకులు బయోడేటా, సర్టిఫికెట్స్‌తో 26న సోమవారం హాజరుకావాలని సూచించారు.

నేడు దేవీపురంలో లలిత జయంతి

సబ్బవరం, ఫిబ్రవరి 23 : మండలంలోని దేవీపురంలో శనివారం మాఘ పౌర్ణమి పురస్కరించుకొని లలితా జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామని గురుపత్ని అన్నపూర్ణమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి గోమాత పూజ, కళశ స్థాపనతో పాటు అమ్మవార్లకు పంచామృతాభిషేకం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ జరుగుతుందని శ్రీవిద్య ట్రస్టు నిర్వాహకులు కందర్ప రమా, ప్రభాకర్ తెలిపారు.

నేడు కొత్తపేటలో రామలింగేశ్వర స్వామి కల్యాణం

ఎలమంచిలి, ఫిబ్రవరి 23: ఎలమంచిలి కొత్తపేటలోని పురాతన రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో శనివారం పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం జరుగుతుందని కమిటీ ప్రతినిధి తెలిపారు. స్థానిక ఆడిటర్ బండారు సత్య బంగారుశెట్టి దంపతులు కల్యాణం చేస్తారని, భక్తులంతా పాల్గొనాలని కోరారు. అనంతరం ప్రసాద, అల్పాహార విందు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

సచివాలయాల్లో పక్కాగా ఆధార్ సేవలు

» జిల్లా ఇన్‌చార్జి మంజులావాణి



వర్క్‌షాపులో మాట్లాడుతున్న సచివాలయాల జిల్లా ఇన్‌చార్జి మంజులావాణి

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 23: సచివాలయాల్లో ఆధార్ నమోదు, మార్పుల సేవలను పూర్తిస్థాయిలో అందించాలని జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల ఇన్‌చార్జి మంజులావాణి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో శుక్రవారం గ్రామ, వార్డు సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులకు ఆధార్ నమోదుపై ఒక్కరోజు వర్కుషాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను పొందేందుకు ఆధార్ మూలమని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల్లోనే ఆధార్ కేంద్రాలను నెలకొల్పిందన్నారు. జన్మించిన ప్రతి ఒక్కరికి ఆధార్ నమోదు చేయాలని, తప్పులు ఉంటే సరిచేయాలన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఆధార్ నమోదు, తప్పులు సరిచేయడం పై సిబ్బందికి అవగాహన కల్పించారు. సిబ్బందికి తలెత్తిన సందేహాలను స్టేట్ కో-ఆర్డినేటర్ సుందరం నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తీర ప్రాంతంలో గట్టి బందోబస్తు : సీఐ


సిబ్బందికి సూచనలిస్తున్న మెరైన్ సీఐ డీవీజే.రమేష్‌కుమార్

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 23 : మాఘ పౌర్ణమి సందర్భంగా సముద్ర స్నానాలకు అధిక సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్టు పెంటకోట మెరైన్ పోలీస్ స్టేషన్ సీఐ డీవీజే.రమేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో సిబ్బందికి బందోబస్తుకు సంబంధించి పలు సూచనలు చేశారు. అనంతం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మాఘ పౌర్ణమి సముద్ర స్నానాలకు పాయకరావుపేట మండలంలోని పాల్మన్‌పేట, రాజయ్యపేట, రాజానగరం, గజపతినగరం, పెంటకోట, అదేవిధంగా నక్కపల్లి మండలంలో బోయపాడు, రాజయ్యపేట, ఎస్.రాయవరం మండలంలో రేవుపోలవరం తీర ప్రాంత గ్రామాల్లో ఉన్న వివిధ ఆలయాలకు రెండు లక్షలకుపైగా భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా ఉండేందుకు నక్కపల్లి, పాయకరావుపేట సీఐలు, ఎస్‌లతోపాటు 150 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేస్తున్నామన్నారు. అదేవిధంగా మత్స్యకార గ్రామాల యువత సహకారంతో గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో మెరైన్ ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మతమార్పిడులు మంచిది కాదు

నిత్య విద్యానంద భారతీస్వామి

నక్కపల్లి, ఫిబ్రవరి 23: హిందూ అనేది ఒక మతం కాదని, అది సనాతన ధర్మమని, విదేశీయులు కూడా ఇప్పుడు మన ధర్మాన్ని, సంప్రదాయాలను ఆచరిస్తున్నారని ఆదిపరాశక్తి క్షేత్ర పీఠాధిపతి నిత్య విద్యానంద భారతీస్వామి అన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం ఆయన రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం నక్కపల్లిలో స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గణపవరం సమీపాన దక్షిణ భారతదేశంలో ఎక్కడా లేని విధంగా ఆదిపరాశక్తి క్షేత్ర నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఎవరు ఏ మతంలో జన్మించారో వారు అదే మతంలో వుండాలని, మతమార్పిడులు మంచిది కాదని చెప్పారు. హిందూ ధర్మం, ఆచారాలు వెనుక ఎన్నో నిగూఢ రహస్యాలు, ఆరోగ్యసూత్రాలు దాగి వున్నాయని చెప్పారు. రాజకీయాలకతీతంగా పలు ఆలయాలు, నాయకులు, అధికారులను కలుస్తూ హిందూ ధర్మ పరిరక్షణ, ఆదిపరాశక్తి క్షేత్ర నిర్మాణం కోసం మహా భిక్షాటన చేస్తున్నామని చెప్పారు. గో సంరక్షణ జరిగే ప్రాంతాలు సుభిక్షంగా వుంటాయన్నారు. జీర్ణావస్థకు చేరిన ఆలయాలను పునరుద్ధరించేవిధంగా అన్ని ప్రాంతాల్లో వున్న హిందువులంతా స్థానికంగా వున్న నాయకుల సహకారం తీసుకోవాలన్నారు.



రైతు సమస్యలపై అగ్రి బిజినెస్ విద్యార్థులకు అవగాహన


పొలంలో రైతులతో చర్చిస్తున్న అగ్రి బిజినెస్ విద్యార్థులు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 23: జాతీయ విస్తరణ యాజమాన్య సంస్థ (మేనేజ్, హైదరాబాద్)లో అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ చదువుతున్న 35 మంది విద్యార్థులు బీసీటీ కేవీకే సహకారంతో శుక్రవారం మండలంలోని జగన్నపేట, తిమ్మరాజుపేట రైతులతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో రైతులకు అందుబాటులో ఉన్న వివిధ పథకాలు, మార్కెటింగ్, పంటసాగు వాటి తెగుళ్లు, ఎరువులు వాడకం, వ్యవసాయ లావాదేవీలు, ప్రభుత్వ పథకాలు మీద అవగాహన తదితర అంశాల గురించి రైతులతో చర్చించారు. ఇందులో భాగంగా కేవీకే చేపడుతున్న వివిధ విస్తరణ కార్యక్రమాలు, ప్రదర్శనా క్షేత్రాల నిర్వహణ, భూసార పరీక్షాకేంద్రం, వరి విత్తనోత్పత్తి అంశాల గురించి శాస్త్రవేత్తలు శైలజ, శ్రీహరి వివరించారు. ఈకార్యక్రమంలో కేవీకే నాయుడు, వీఎస్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నల్లమారమ్మతల్లి పండుగ గోడపత్రిక ఆవిష్కరణ

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 23 : మండలంలోని బీఆర్టీ కాలనీలో నల్లమారమ్మతల్లి అమ్మవారి మహోత్సవానికి సంబంధించిన గోడపత్రికను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. పండగకు సంబంధించి ఏర్పాట్లు, నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు భాస్కరరావుకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

డీఐజీని కలిసిన ఎన్‌హెచ్‌ఆర్‌పీ ఫోరమ్ ప్రతినిధులు


డీఐజీ విశాల్‌గున్నికి పుష్పగుచ్ఛం ఇస్తున్న దేవవరపు లక్ష్మీగాయత్రి

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 23 : విశాఖపట్నం రేంజ్ డీఐజీ విశాల్ గున్నిని పాయకరావుపేట మండలం పాల్తేరు గ్రామానికి చెందిన జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ విమెన్ వింగ్ జాతీయ అధ్యక్షురాలు దేవవరపు లక్ష్మీగాయత్రి శుక్రవారం కలిశారు. విశాఖలో డీఐజీని మర్యాద పూర్వకంగా కలిసిన ఆమె పుష్ప గుచ్ఛం అందజేశారు. అదేవిధంగా ఎన్‌హెచ్‌ఆర్‌పీ ఫోరమ్ ద్వారా చేపడుతున్న సంక్షేమ, సేవా కార్యక్రమాలను డీఐజీకి వివరించారు. ఆమె వెంట ఫోరమ్ సోషల్ మీడియా ఇన్‌చార్జి పి.మాధురి ఉన్నారు.

విశాల మినీ సంత్ నిరంకారీ సమాగం

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 23 : మండలంలోని వమ్మవరం గ్రామంలో సద్గురు బాబా హరదేవ్ సింగ్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం సంత్ నిరంకారీ మండలి ఆధ్వర్యంలో విశాల మినీ సంత్ సమాగం జరిగింది. ఈ కార్యక్రమానికి రుషికొండ అప్పారావు అధ్యక్షత వహించారు. సంత్ సమగానికి విశాఖ నిరంకారీ మండల సహ సంయోజకులు, జ్ఞాన ప్రచారకులు పీవీ రావు, విశాఖ సంత్ నిరంకారీ మండలి సంయోజకులు ప్రేమ్ మీర్ పురి హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షోపన్యాసాన్ని రుషికొండ అప్పారావు చేస్తూ మానవజన్మ అమూల్యమైనదన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి భక్తులు హాజరయ్యారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ సెంటర్

నక్కపల్లి, ఫిబ్రవరి 23: మండలంలోని చినదొడ్డిగల్లు జడ్పీ హైస్కూల్‌లో టెన్త్ చదువుతున్న విద్యార్థుల కోసం రాత్రి వేళల్లో స్టడీ సెంటర్లను ఏర్పాటు చేసి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. పలు సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను ఎంపిక చేసి వారి నివాస గృహాల వద్దకు వెళ్లి స్టడీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా రవీంద్రనాధ్ ఠాగూర్ ఇంగ్లీష్ క్లబ్ వ్యవస్థాపకుడు, ఆంగ్ల ఉపాధ్యాయుడు యేడిద వెంకట రమణ శెట్టిబలిజ పేటలో విద్యార్థులకు గత కొన్ని రోజుల నుంచి స్టడీ సెంటర్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వెంకటరమణ మాట్లాడుతూ తమ స్కూల్‌లో చదువుతున్న టెన్త్ విద్యార్థులంతా నూరు శాతం ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

చేతి బోరును బాగుచేయరూ

రాంబిల్లి, ఫిబ్రవరి 23 : మండలంలోని కొండవారపాలెంలో మరమ్మతుకు గురైన చేతిబోరును బాగు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామంలోని పలు కుటుంబాలకు నీటి అవసరాలు తీరుస్తున్న చేతిబోరు ఏడాదిగా మరమ్మతులకు గురైందన్నారు. గ్రామంలోని కొళాయిల ద్వారా తాగునీరు వస్తున్న సరిపోకపోవడంతో చేతిబోరు ఎంతో ఉపయోగకరంగా ఉండేదని వారంటున్నారు. అధికారులు స్పందించి బోరును బాగు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

క్రికెట్ విజేత కొత్త రేవుపోలవరం వారియర్స్


కొత్త రేవుపోలవరం వారియర్స్ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎస్ వెంకటరాజు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 23: మాఘ పౌర్ణమి జాతర సందర్భంగా మండలంలోని కొత్త రేవు పోలవరంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీల్లో రేవుపోలవరం, కొత్త రేవుపోలవరం గ్రామాలకు చెందిన ఎనిమిది జట్లు పాల్గొనగా శుక్రవారం జరిగిన ఫైనల్ పోటీల్లో కొత్త రేవుపోలవరం వారియర్స్ జట్టు విజేతగా నిలవగా, ద్వితీయ స్థానంలో రేవుపోలవరం జట్టు నిలిచింది. స్థానిక మాజీ సర్పంచ్ బంగారి, రాజు ఈ ఇద్దరి ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన ట్రోఫీతో పాటు విజేతగా నిలిచిన జట్టుకు రూ. 20వేలు. ద్వితీయస్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేలు నగదు బహుమతులను టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎస్.వెంకటరాజు అందజేశారు.

సుధాలక్ష్మిని సన్మానించిన పీఆర్‌టీయూ నేతలు


గుడివాడ హైస్కూల్‌లో సుధాలక్ష్మిని సన్మాస్తున్న పీఆర్‌టీయూ సభ్యులు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 23: అనకాపల్లిలో ఇటీవల జరిగిన ఇన్‌స్పైర్ మనక్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టు తయారు చేసిన గుడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని సుధాలక్ష్మిని శుక్రవారం పీఆర్‌టీయూ నాయకులు సన్మానించారు. సుధాలక్ష్మి సేవలను వారు కొనియాడారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపినాథ్, పెద్ది నాయుడు, విశ్వేశ్వరరావు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, సమన్వయకర్త సత్యనారాయణ పాల్గొన్నారు.

ముగిసిన వృత్తి విద్యా ప్రాక్టికల్ పరీక్షలు



వృత్తి విద్యా ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి, ఫిబ్రవరి 23: మండలంలోని గొడిచెర్ల హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థుల వృత్తి విద్యా ప్రాక్టికల్స్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయని హెచ్‌ఎం ఎన్.రామప్రతాప్‌రావు చెప్పారు. సుమారు 92 మంది విద్యార్థులు కంప్యూటర్ విభాగంలో ప్రాక్టికల్ పరీక్షలకు హాజరయ్యారని చెప్పారు. వృత్తి నైపుణ్య విద్యను పెంపొందించుకోవడానికి ఈ పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. వృత్తి విద్యా టీచర్ పుప్పాల విష్ణు పర్యవేక్షణలో ఈ పరీక్షలు విజయవతంగా ముగిశాయని చెప్పారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో పౌర్ణమి పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న దాడి రత్నాకర్

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 23 : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానం శతజయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా నగర సంకీర్తన, గోపూజ, ప్రదక్షిణలు, అమ్మవారికి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు దాడి రత్నాకర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ బుచ్చిరాజు, సభ్యులు శేషుకుమార్, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంఏఎల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘ సమావేశం

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 23: స్థానిక ఏఎంఏఎల్ కాలేజీలో పూర్వ విద్యార్థుల సంఘం కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. జార్జిక్లబ్ కార్యదర్శి బుద్ద కాశీవిశ్వేశ్వరరావు సంఘానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కృష్ణంరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

28న వారపుసంత ఆశీల వేలం

పరవాడ, ఫిబ్రవరి 23: మండల కేంద్రంలో నిర్వహించే మంగళవారం సంత ఆశీల వేలాన్ని ఈనెల 28వ తేదీ ఉదయం పదిన్నర గంటలకు నిర్వహించనున్నట్టు పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్వహించనున్న వేలంలో పాల్గొనేవారు రూ.రెండు లక్షలకు సరిపడా సాల్విన్సీ, రూ. 50వేలు ధరావత్తు చెల్లించాలన్నారు. అలాగే కబేళా ఆశీల వేలంలో పాల్గొనే వారు రూ.30వేలుకు సరిపడా సాల్విన్సీ, రూ. ఐదు వేలు ధరావత్తు చెల్లించాలన్నారు. ఎంపీడీవో ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు.మరిన్ని వివరాల కోసం 9441058563 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధిగా స్రవంతి


స్రవంతిని అభినందిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు

మునగపాక, ఫిబ్రవరి 23: టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధిగా మునగపాకకు చెందిన బీలా స్రవంతిని నియమించినట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మునగపాక పార్టీ కార్యాలయంలో ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎస్సీల ఓట్లు అధికంగా ఉన్నాయని, విద్యాధికారాలైన స్రవంతిని అధిష్ఠానం నియమించడం సరైన చర్యని అన్నారు. ఈ సందర్భంగా స్రవంతిని మండల పార్టీ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు భీమరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మైనర్ శారదాలో మిక్సర్ లారీ బోల్తా


మైనర్ శారదాలో బోల్తా పడిన మిక్సర్ లారీ

రాంబిల్లి, ఫిబ్రవరి 23 : మండలంలోని నారాయణపురం సమీపంలోని మైనర్ శారదా నదిలో శుక్రవారం తెల్లవారు జామున మిక్సర్ లారీ బోల్తాపడింది. వెంకటాపురం నుంచి ఎలమంచిలి వైపు వెళుతున్న మిక్సర్ లారీఅజ డ్రైవర్ నిద్రమత్తులో నడపడంతో ఈ ప్రమాదం జరిగింది. నారాయణపురం వద్ద మైనర్ శారదా నదిపై ఉన్న వంతెన గోడను ఢీకొట్టి బోల్తా పడిందని స్థానికులు చెబుతున్నారు. ఈ సంఘటనలో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయన్నారు. ఈ విషయాన్ని సీఐ లక్ష్మణరావు వద్ద ప్రస్తావించగా ఇంతవరకు ఫిర్యాదు రాలేదన్నారు.

మామిడివాడ వద్ద రోడ్డుకు మరమ్మతులు

రాంబిల్లి, ఫిబ్రవరి 23: మండలంలోని వెంకటాపురం నుంచి ఎలమంచిలి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో కొత్తూరు మామిడివాడ వద్ద మరమ్మతులు చేపట్టారు. ఈ రోడ్డు గోతులమయమై రాళ్లు తేలిపోయి ప్రమాదకరంగా మారింది. వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఎట్టకేలకు స్పందించిన అధికారులు దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టడంతో స్థానికులతోపాటు వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

122వ రోజుకు పెదకలవలాపల్లి రైతుల దీక్షలు

రాంబిల్లి, ఫిబ్రవరి 23: తమ పంట పొలాలకు వెళ్లే దారులు మూస్తూ నేవీ అధికారులు నిర్మిస్తున్న ప్రహరీని నిలిపేయాలంటూ పెదకలవలాపల్లి రైతులు చేస్తున్న రిలే దీక్షలు శుక్రవారానికి 122వ రోజుకు చేరుకున్నాయి. పూడిమడక ఎంపీటీసీ సభ్యులు ఎం.అప్పలనాయుడు, జనసేన పార్టీ జిల్లా నేత చోడిపల్లి అప్పారావు రైతులు చేస్తున్న రిలే దీక్షా శిబిరాన్ని సందర్శించి, తమ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల పొలాలకు దారులు ఉంచాలని డిమాండ్ చేశారు. ప్రహరీ నిర్మిస్తే రైతులు పొలాలకు ఎలా వెళతారని వారు ప్రశ్నించారు. అధికారులు స్పందించి రైతులకు ప్రత్యామ్నాయ రహదారిని ఏర్పాటు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు రావి దేముడుళ్ల, రైతులు పాల్గొన్నారు.

హైస్కూల్‌ను సందర్శించిన స్టేట్ ఎల్‌ఐపీ టీం


టీచర్లతో మాట్లాడుతున్న ఎల్‌ఐపీ టీం సభ్యులు

సబ్బవరం, ఫిబ్రవరి 23: స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌ను ఎల్‌ఐపీ (లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్) రాష్ట్ర టీం శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా 6,7,8 తరగతులలో విద్యార్థుల లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్, అభ్యాసన నైపుణ్యాల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంగ్లీషు, సైన్స్, సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎల్‌ఐపీ టీం సభ్యులు భారతి, త్రినాధరావు, డైట్ అధ్యాపకులు రామనాథం (ఎస్‌సీఈఆర్‌టీ, శ్రీకాకుళం డైట్), ఎంఈవో-1 లక్ష్మణరావు, హెచ్‌ఎం తిరుపతిరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిజిటల్ గ్రంథాలయ నిర్మాణానికి భూమి పూజ

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 23 : మండలంలోని కొత్తూరు పంచాయతీలోని రూ.89 లక్షలతో ఎనిమిది సెంట్ల స్థలంలో నిర్మించనున్న డిజిటల్ గ్రంథాలయ భవనానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. గ్రంథాలయ నిర్మాణం పూర్తయితే పౌరులకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ కొండా రాజీవ్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ బోర్డు వివక్ష

... 5వ పేజీ తరువాయి

ఉన్నారు. వీరికి జంబ్లింగ్ వర్తించదన్న నిబంధనను అధికారులు బేఖాతరు చేశారు. కాగా 15 కిలోమీటర్లలోపు అనే నిబంధనను ఇంటర్ బోర్డు అధికారులు తుంగలో తొక్కడమే కాకుండా దివ్యాంగ విద్యార్థులన్న కనికరం కూడా లేకుండా సుదూరంలో వున్న కాలేజీలను పరీక్షా కేంద్రాలుగా కేటాయించారు. దీనిపై కళాశాల నిర్వాహకులతోపాటు విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అకేషియా కర్రలు స్వాధీనం

... 5వ పేజీ తరువాయి

చేశారు. అకేషియా కర్రల విలువ రూ.3 లక్షలు ఉంటుదన్నారు. జిరాయితీ భూముల్లో సాగు చేసిన అకేషియా చెట్లను ఎటువంటి అనుమతులు లేకుండా నరికివేసి, కర్రలను పేపర్ మిల్లులకు తరలిస్తున్నారని ఆయన చెప్పారు. రైతులు తమ సొంత భూముల్లో పెంచిన టేకు, ఇతర కలప చెట్లను, సరుగుడు, అకేషియా, నీలగిరి, ఇతర తోటలను రెవిన్యూ, అటవీ శాఖల అనుమతులు లేకుండా నరక కూడదని స్పష్టం చేశారు. ఈ దాడుల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ రేంజ్ అధికారి గంగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మోదకొండమ్మ తీర్థం పోస్టర్ ఆవిష్కరణ

మాడుగుల, ఫిబ్రవరి 23 : ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దేవత మాడుగుల మోదకొండమ్మ తీర్థం ఈ నెల 27న జరగనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యులు శుక్రవారం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, బలిరెడ్డి అప్పలరాజు, తమ్మి పాపియ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు పక్కాగా ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

కేంద్రాల్లో మౌలిక వసతులు, సీప్ కార్యక్రమ నిర్వహణ, ఈవీఎంలు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలు, ఇతర అంశాల గురించి తెలియజేశారు. ఈ సమావేశంలో అనకాపల్లి ఆర్డీఓ చిన్నికృష్ణ, నోడల్ అధికారులు, డ్వామా పీడీ సందీప్, ఆర్‌అండ్‌బీ ఈఈ రమేశ్, మత్స్య శాఖ డీడీ ప్రసాదరావు, ఏపీఎంఐపీ పీడీ కేవీ.లక్ష్మి, డీఎస్‌ఓ కేవీఎల్ఎన్.మూర్తి, పౌర సరఫరాల శాఖ డీ.ఎం. జయంతి, లీడ్ బ్యాంక్ మేనేజరు సత్యనారాయణ, డీసీఓ కిరణ్‌కుమారి, అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్‌ఓలు సత్యవాణి, కె.మనోరమ, కె.గీతాంజలి, తాహసీల్దార్లు పాల్గొన్నారు.

కొండకర్ల రిసార్ట్‌లో అడ్డగోలు వ్యవహారాలు

... 5వ పేజీ తరువాయి

ఇద్దరు యువకులు, నలుగురు యువతులు ఉన్నారు. వీరిని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. కాగా ఈ సంఘటనపై అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. తమకు సమాచారం రాగానే వెంటనే పోలీసులను పంపి అక్కడున్న వారిని స్టేషన్‌కు రప్పించామన్నారు. చిన్నపాటి ఘర్షణ జరిగిందని వారు చెప్పడంతో కౌన్సెలింగ్ ఇచ్చి పంపించామన్నారు. యువతులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయకుండా మందలించి పంపించి వేశామని సీఐ చెప్పారు.

నేత్రపర్వంగా కేశవ స్వామి కల్యాణోత్సవాలు



ఉత్సవాల్లో భాగంగా సదస్యం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

చోడవరం, ఫిబ్రవరి 23 : పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి కల్యాణోత్సవాలను నేత్రపర్వంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం సదస్యం, పండిత గోష్ఠి వంటి కార్యక్రమాలను జరిపారు. ఆలయ అర్చకులు సుదర్శన సీతారామాచార్యులు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకల్లో పెద్దలు ఉపాధ్యాయుల శ్రీనివాస్, ఉప్పల బాబు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అడివిరాజులబాబు పండగ



కృష్ణాదేవిపేటలో అడివిరాజులబాబును దర్శించుకుంటున్న భక్తులు



మాకవరపాలెంలో..

మాకవరపాలెం/ కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 23 : అడివిరాజులబాబు పండగను శుక్రవారం పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మాకవరపాలెం మండలం జి.గంగవరం, లచ్చన్నపాలెం, పీవీఅగ్రహారం, నారాయణరాజుపేట, ఎర్రకన్నపాలెం, మాకవరపాలెం తదితర గ్రామాల్లో, అలాగే, గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి పార్కు వద్ద జరిగిన ఈ వేడుకలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. గ్రామానికి దూరంగా ఉన్న పొలాల్లోని గుడులకు వెళ్లి దర్శించుకున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో కోలాహల వాతావరణం నెలకొంది. ఇదిలావుంటే, మాకవరపాలెం మండలం బూరుగుపాలెంలో పరదేశమ్మ పండగను నిర్వహించారు. అయ్యన్న యువసేన అధ్యక్షులు చింతకాయల రాజేష్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి చిరంజీవితో పాటు పలువురు టీడీపీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అలాగే, కృష్ణాదేవిపేటలో ఆలయ ధర్మకర్త కొమ్మనాపల్లి రామారావు తదితరులు వేడుక ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నిరుపయోగంగా ఆర్‌బీకే భవనం



పాపయ్యపాలెంలో నిరుపయోగంగా ఉన్న భవనం

మాకవరపాలెం, ఫిబ్రవరి 23 : మండలంలోని పాపయ్యపాలెంలో నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనం ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. గ్రామానికి కిలోమీటరున్నర దూరంలో గల తోటల్లో ఈ భవన నిర్మాణం చేపట్టారు. దీర్ఘకాలం పాటు ఈ పనులు సాగినా ఎట్టకేలకు పూర్తి చేశారు. ఈ ఏడాది జనవరి చివరి రోజుల్లో నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేశ్ స్థానిక నాయకుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. అయితే భవనం ప్రారంభించి ఇరవై రోజులు గడిచినా ఇందులోకి నేటికీ వ్యవసాయ శాఖ సిబ్బంది రాలేదు. దీనికితోడు వ్యవసాయానికి అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు కూడా ఈ కార్యాలయానికి చేరలేదు. గ్రామానికి దూరంగా ఉందనో.. లేక భవనంలో తగిన సౌకర్యాలు లేవని కారణమో తెలియనప్పటికీ భవనం మాత్రం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. లక్షలాది రూపాయల ప్రజా ధనం వృథాకాకుండా భవనాన్ని అందుబాటులోకి తీసుకు రావాల్సిందిగా పలువురు గ్రామస్థులు కోరుతున్నారు.

ఇంటర్ బోర్డు వివక్ష

... 5వ పేజీ తరువాయి

ఉన్నారు. వీరికి జంబ్లింగ్ వర్తించదన్న నిబంధనను అధికారులు బేఖాతరు చేశారు. కాగా 15 కిలోమీటర్లలోపు అనే నిబంధనను ఇంటర్ బోర్డు అధికారులు తుంగలో తొక్కడమే కాకుండా దివ్యాంగ విద్యార్థులన్న కనికరం కూడా లేకుండా సుదూరంలో వున్న కాలేజీలను పరీక్షా కేంద్రాలుగా కేటాయించారు. దీనిపై కళాశాల నిర్వాహకులతోపాటు విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అకేషియా కర్రలు స్వాధీనం

... 5వ పేజీ తరువాయి

చేశారు. అకేషియా కర్రల విలువ రూ.3 లక్షలు ఉంటుదన్నారు. జిరాయితీ భూముల్లో సాగు చేసిన అకేషియా చెట్లను ఎటువంటి అనుమతులు లేకుండా నరికివేసి, కర్రలను పేపర్ మిల్లులకు తరలిస్తున్నారని ఆయన చెప్పారు. రైతులు తమ సొంత భూముల్లో పెంచిన టేకు, ఇతర కలప చెట్లను, సరుగుడు, ఆకేషియా, నీలగిరి, ఇతర తోటలను రెవిన్యూ, అటవీ శాఖల అనుమతులు లేకుండా నరక కూడదని స్పష్టం చేశారు. ఈ దాడుల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ రేంజ్ అధికారి గంగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు పక్కాగా ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

కేంద్రాల్లో మౌలిక వసతులు, సీప్ కార్యక్రమ నిర్వహణ, ఈవీఎంలు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలు, ఇతర అంశాల గురించి తెలియజేశారు. ఈ సమావేశంలో అనకాపల్లి ఆర్డీఓ చిన్నికృష్ణ, నోడల్ అధికారులు, డ్వామా పీడీ సందీప్, ఆర్‌అండ్‌బీ ఈఈ రమేశ్, మత్స్య శాఖ డీడీ ప్రసాదరావు, ఏపీఎంఐపీ పీడీ కేవీ.లక్ష్మి, డీఎస్ఓ కేవీఎల్ఎన్.మూర్తి, పౌర సరఫరాల శాఖ డీ.ఎం. జయంతి, లీడ్ బ్యాంక్ మేనేజరు సత్యనారాయణ, డీసీఓ కిరణ్‌కుమారి, అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్ఓలు సత్యవాణి, కె.మనోరమ, కె.గీతాంజలి, తాహసీల్దార్లు పాల్గొన్నారు.

కొండకర్ల రిసార్ట్‌లో అడ్డగోలు వ్యవహారాలు

... 5వ పేజీ తరువాయి

ఇద్దరు యువకులు, నలుగురు యువతులు ఉన్నారు. వీరిని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. కాగా ఈ సంఘటనపై అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. తమకు సమాచారం రాగానే వెంటనే పోలీసులను పంపి అక్కడున్న వారిని స్టేషన్‌కు రప్పించామన్నారు. చిన్నపాటి ఘర్షణ జరిగిందని వారు చెప్పడంతో కౌన్సెలింగ్ ఇచ్చి పంపించామన్నారు. యువతులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయకుండా మందలించి పంపించి వేశామని సీఐ చెప్పారు.

శారదానగర్‌లో డ్రైనేజీ సమస్య తీరేనా..?

- అసంపూర్తిగా కాలువల పనులు
- ట్రాన్స్‌ఫార్మర్ల అడ్డు తొలగించకపోవడమే కారణం
- పట్టించుకోని ఎమ్మెల్యే గణేశ్
- దుర్వాసన, దోమల బెడదతో నివాసితులు అవస్థలు

నర్సీపట్నం, ఫిబ్రవరి 23 : మునిసిపాలిటీ పరిధి శారదానగర్‌లో మురుగు తీరని సమస్యగా మారింది. కాలువ నిర్మాణం అసంపూర్తి నిలిచిపోవడంతో ఎక్కడికక్కడ తిష్ఠ వేస్తోంది. ఫలితంగా ఓవైపు దుర్వాసన, మరో వైపు దోమల బెడదతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేశ్ ఈ సమస్యను పట్టించుకున్న దాఖలాలు లేవని శారదానగర్ వాసులు వాపోతున్నారు.



కాలువ పనులకు అడ్డుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

టీడీపీ ప్రభుత్వంలో రూ.4.5 కోట్లు మంజూరు

గత టీడీపీ ప్రభుత్వంలో ఆర్‌అండ్‌బీ శాఖా మంత్రిగా ఉన్న చింతకాయల అయ్యన్నపాత్రుడు 2018లో శారదానగర్‌లో మెయిన్ రోడ్డుకు ఇరువైపులా రోడ్డు అభి వృద్ధికి, కాలువ నిర్మాణానికి రూ.4.5 కోట్లు మంజూరు చేశారు. ఆర్‌అండ్‌బీ అధికారులతో కాంట్రాక్టర్ కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం నుంచి బైపాస్ రోడ్డు చివరి వరకు 1.84 కి.మీ. బీటీ రోడ్డు, 800 మీటర్లు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, కిలో మీటరు పొడవు ఓపెన్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అగ్రిమెంట్ ప్రకారం కాంట్రాక్టర్ బీటీ రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేశారు. డ్రైనేజీ పనులకు అడ్డుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించలేదన్న కారణంతో మధ్యలో పనులు ఆపేశారు.

అడ్డంకిగా ట్రాన్స్‌ఫార్మర్లు

ఇదిలావుంటే, డ్రైనేజీ కాలువ పనులకు అడ్డుగాఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని సదరు కాంట్రాక్టర్ ఆర్‌అండ్‌బీ అధికారులను కోరారు. దీంతో వీటిని మార్చడానికి ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ఈపీడీసీఎల్‌కు రూ.30లక్షలు చెల్లించారు. నిర్మాణ పనులకు అడ్డుగా ఉన్న స్తంభాలను విద్యుత్‌శాఖ అధికారులు తొలగించారు.

మూడు చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాల్సి ఉంది. ఆర్టీసీ కాంప్లెక్స్ గోడను ఆనుకొని డ్రైనేజీ మీద ఉన్న ట్రాన్స్‌ఫార్మ డిపో లోపలకు మార్చడానికి పీటీడీ డిపో మేనేజర్ అంగీకరించ లేదు. పోస్టాఫీస్ దాటిన తర్వాత పాత ఇనుప సామగ్రి కొట్టు సమీపంలో ఒకటి, సుబ్రహ్మణ్య స్వామి గుడి ఎదురుగా ఒకటి ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణ పనులకు అడ్డుగా ఉండడంతో చాలా కాలంగా పనులు నిలిచిపోయాయి.



బలిఘట్టం బైపాస్ రోడ్డులో కూలిపోయిన డ్రైనేజీ సైడ్ వాల్స్

ఎమ్మెల్యే స్పందించడం లేదని ఆవేదన

ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించకపోతే పని చేయలేమని ఆర్‌అండ్‌బీ అధికారులకు కాంట్రాక్టర్ లిఖిత పూర్వంగా తెలియజేశారు. బలిఘట్టం బైపాస్ రోడ్డు, శారదానగర్ ప్రధాన డ్రైనేజీ పనులు మొత్తం అంచనా విలువ రూ.4.5 కోట్లకుగాను రూ. 3.10 కోట్లు విలువ చేసేపనులు పూర్తి చేశారు. ఇంకా 1.4 కోట్లు పని చేయాల్సి ఉంది. నాలుగున్నర ఏళ్లుగా ఈ పనులు నిలిచి పోయాయి. అయినప్పటికీ పట్టించుకునేవారు కరువయ్యారు. ఎమ్మెల్యే గణేశ్ దృష్టిసారించక పోవడంతో అక్కడివారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మురుగు తిష్ఠతో దోమల బెడద

కాంట్రాక్టర్ పనులు మధ్యలో ఆపేయడంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. మురుగు పారకపోవడంతో దోమలు బెడద తీవ్రంగా ఉంది. దీంతో రాత్రివేళ కంటిమీద కునుకు ఉండడం లేదని, రోగాల బారిన పడుతున్నామని అంతా వాపోతున్నారు.

కూలిపోయిన డ్రైనేజీ సైడ్ వాల్స్

ఇదిలావుంటే, ఓపెన్ డ్రైనేజీ కోసం నిర్మించిన కాంక్రీట్ సైడ్ వాల్స్ చాలా వరకు కూలిపోయాయి. బైపాస్ రోడ్డులోని వై.జంక్షన్ సమీపంలో డ్రైనేజీ సైడు పగుళ్లు ఇచ్చి పునాదులు బలంగా లేకపోవడంతో పక్కకు వాలిపోయాయి. కాలువల్లో పూడిక పేరుపోయి మురుగు నీరు నిలిచిపోతోంది. ఉన్నతాధికారులు వెంటనే స్పందించాల్సిందిగా వారంతా కోరుతున్నారు.

ఓటు ప్రాధాన్యాన్ని కొత్త ఓటర్లకు వివరించండి

- పార్టీ శ్రేణులకు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్



ఓటు హక్కుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరిస్తున్న విజయ్, పీవీజీ కుమార్

మాడుగుల, ఫిబ్రవరి 23 : రానున్న ఎన్నికల్లో తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకోనున్న ఓటర్లకు ఓటు ప్రాధాన్యతపై పూర్తి అవగాహన కల్పించే బాధ్యతను నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ సూచించారు. గురువారం ఇక్కడ పార్టీ మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాడుగుల నియోజకవర్గంలో 19వేల కొత్తఓట్లు నమోదైనట్టు చెప్పారు. ఈ ఓటర్లంతా రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రగతికి సమర్థవంతమైన నాయకుడు చంద్రబాబునాయుడుకు ఓటు వేసేలా వారికి వివరించాలన్నారు. అంతేకాకుండా ఐదేళ్ల వైసీపీ పాలనలో అప్పలతో పాటు రాష్ట్రంలో దుస్థితిని వారికి తెలియజేయాలన్నారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లో తలసరి ఆదాయం తగ్గిపోవడంతో పాటు పనులు లేక ఉపాధి కోల్పోయి ఎంతమంది రోడ్డున పడ్డారన్న విషయాన్ని గుర్తుచేయాలని సూచించారు. అనంతరం మై ఫస్ట్ ఓట్ ఫర్ డెవలప్‌మెంట్.., మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్.. అంటూ నినాదాలు చేశారు. ఆ తరువాత ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు, టౌన్ అధ్యక్షుడు రంజిత్‌వర్మ, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, లెక్కల కాశిబాబు, మరువాడ ఈశ్వరరావు, డిల్లీ నానాజీ, పుప్పాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ తీర్థం పోస్టర్ ఆవిష్కరణ



తీర్థం పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

మాడుగుల, ఫిబ్రవరి 23 : ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దేవత మాడుగుల మోదకొండమ్మ తీర్థం ఈ నెల 27న జరగనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యులు శుక్రవారం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, బలిరెడ్డి అప్పలరాజు, తమ్మి పాపియ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

3న సమగ్ర శిక్ష సిబ్బంది 'చలో విశాఖ'



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సమగ్ర శిక్ష సిబ్బంది

నర్సీపట్నం, ఫిబ్రవరి 23 : కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, పార్ట్ టైమ్ సిబ్బంది డిమాండ్లపై అన్ని రాజకీయ పార్టీలు స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు పూడి వెంకట్రావు కోరారు. శుక్రవారం ఇక్కడి ఎంఈవో కార్యాలయం వద్ద చలో విశాఖ ప్లకార్డులను ప్రదర్శించారు. వచ్చే నెల మూడో తేదీన మహా గర్జన పేరుతో విశాఖలో సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది క్రమబద్ధీకరణ, సమాన పనికిసమాన వేతనం, ఉద్యోగ భద్రత, గ్రాట్యుటీ, పెన్షన్ డిమాండ్లపై అన్ని రాజకీయ పార్టీలు అనుకూల ప్రకటన చేయాలని కోరారు. సంఘం కార్యదర్శి ఎస్.రమేష్, మహిళా కార్యదర్శి బి.భవానీ, ధారలక్ష్మి, రామలక్ష్మి పాల్గొన్నారు.

'వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరుబాట'



ప్రజాపోరు యాత్ర నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మాకవరపాలెం, ఫిబ్రవరి 23 : వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలపై అంతా పోరాటం చేయాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మర్రి నాయుడు పిలుపు నిచ్చారు. శెట్టిపాలెం, రాజుపేట, భీమబోయినపాలెం, రాచపల్లి, మాకవరపాలెం, తూటిపాల గ్రామాల్లో శుక్రవారం ప్రజాపోరు యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ అవి నీతిపై అంతా కలిసి కట్టుగా పోరాటం చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడిగర్ల రాంబాబు, అంజనేయులు, శ్రీనివాస్, త్రినాథ్ తదితులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో టాయిలెట్ల నిర్మాణానికి వితరణ



ప్రిన్సిపాల్‌కు చెక్కును అందజేస్తున్న కళాశాల పూర్వ విద్యార్థులు

చోడవరం, ఫిబ్రవరి 23 : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టాయిలెట్ల నిర్మాణానికి పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చారు. 1974 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన ఈర్లె శ్రీరామమూర్తి, డాక్టర్ దుర్గాప్రసాద్ తదితరులతో కూడిన కమిటీ కాలేజీలో టాయిలెట్ల నిర్మాణానికి రూ.లక్షా 24వేలను శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ రాధాకృష్ణకు అందించారు. ఈ సందర్భంగా అధ్యాపక, అధ్యాపకేతన సిబ్బంది వీరిని అభినందించారు.

ఉత్సాహంగా కాశీపురం పాఠశాల వార్షికోత్సవం



పాఠశాలలో విద్యార్థినుల నృత్యాలు

దేవరాపల్లి, ఫిబ్రవరి 23 : కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఆట పాటలతో అలరించారు. ఝాన్సీలక్ష్మీ భాయి ఏకపాత్రాభినయం, కోలాటం, భరతనాట్యం వంటి వాటితో వేడుకకే వన్నె తెచ్చారు. ప్రధానోపాధ్యాయిని పి.బి.టి. సుందరి పదో తరగతి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంబాబు, పూర్ణిమ, సత్యవతి, సింహాచలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'వ్యవసాయ మార్కెట్ కార్యకలాపాలు విస్తరణ'



మార్కెట్ యార్డును ప్రారంభిస్తున్న ధర్మశ్రీ

చోడవరం, ఫిబ్రవరి 23 : నియోజకవర్గంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యకలాపాలను మరింత విస్తరించనున్నామని విప్ ధర్మశ్రీ తెలిపారు. ఇక్కడి వ్యవసాయ మార్కెట్ ఆవరణలో నిర్మించిన యార్డును శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నరసింగరావు, ఎంపీపీ గాడి కాసు, డీసీసీబీ డైరెక్టర్ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రతి పక్షాలపై విమర్శలు మాని.. రోడ్డు వేయండి'



విలేకరుల సమావేశంలో పాల్గొన్న జనసేన నాయకులు

చోడవరం, ఫిబ్రవరి 23 : ప్రతిపక్ష పార్టీలపై విమర్శలు మాని, ముందు ప్రజల కష్టాలు తీర్చేందుకు బీఎన్ రోడ్డు పనులు పూర్తిచేయించాలని ప్రభుత్వ విప్ ధర్మశ్రీకి జనసేన పార్టీ నాయకులు హితవు పలికారు. శుక్రవారం ఇక్కడి విలేకరులతో వారు మాట్లాడుతూ విప్ ధర్మశ్రీ, వైసీపీ నాయకులు జనసేన నేత పీవీఎస్ఎన్ రాజు, టీడీపీ నేతలపై విరుచుకుపడడం విడ్డూరంగా ఉందన్నారు. అభివృద్ధి లేదు అంతా అవినీతే అని ప్రశ్నిస్తే తప్పేమిటన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో నాయకులు అల్లం రామప్పారావు, గూనూరు మూలునాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెట్టుపల్లిలో ఉచిత వైద్య శిబిరం

నర్సీపట్నం, ఫిబ్రవరి 23 : చెట్టుపల్లిలో ఆరోగ్య సురక్షలో భాగంగా శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పలువురు రోగులకు పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హేమంత్ శిబిరాన్ని సందర్శించి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణికి పలు సూచనలు చేశారు.

'జర్నలిస్టులపై దాడి చేసిన వారిని శిక్షించాలి'

చీడికాడ, ఫిబ్రవరి 23 : జర్నలిస్టులపై దాడులకు పాల్పడిన వైసీపీ మూకను కఠినంగా శిక్షించాని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి సన్యాసినాయుడు శుక్రవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాప్తాడులో సీఎం జగన్ 'సిద్ధం' సభను కవర్ చేసేందుకు వెళ్లిన ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడినిఖండించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాల్సిందిగా కోరారు. వైసీపీ పాలనలో అరాచకాలు అధికమయ్యాయని ఆరోపించారు. వీటన్నింటికీ త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రజలంతా ఓటుతో తగిన చెప్పాలన్నారు.

'చలో మాదిగ... చలో అనకాపల్లి' రేపు

రోలుగుంట, ఫిబ్రవరి 23 : జిల్లా కేంద్రంలో ఈ నెల 25న జరగనున్న 'చలో మాదిగ. చలో అనకాపల్లి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా ఎమ్మార్పీఎస్ మండల కార్యదర్శి పులగుజ్జుల వెంకటలక్ష్మి రమణ కోరారు. శుక్రవారం రోలుగుంటలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి మందకృష్ణ మాదిగ హాజరు కానున్నట్టు చెప్పారు. మాదిగల సమస్యలపై చర్చించనున్నట్టు వివరించారు. మండలంలోని అన్ని పంచాయతీల నుంచి పెద్ద ఎత్తున మాదిగలు తరలి రావాల్సిందిగా కోరారు.

ఘనంగా సంతోషిమాత తీర్థం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 23 : కేజేపురం జంక్షన్‌లో కొలువుదీరిన సంతోషిమాత తీర్థం శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లి నాయుడు, మోదమాంబ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో భాగంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్దసంఖ్యలో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం కబడ్డీ, ముగ్గుల పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి.

నేడు బ్రహ్మలింగేశ్వరస్వామి గిరి ప్రదక్షణ

నర్సీపట్నం, ఫిబ్రవరి 23 : మాఘ పౌర్ణమి సందర్భంగా బలిఘట్టం శ్రీరాజరాజేశ్వరి సమేత బ్రహ్మలింగేశ్వర స్వామి గిరి ప్రదక్షణకు మొట్టమొదటి సారిగా ఏర్పాట్లు చేస్తున్నారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి ప్రారంభం కానున్న గిరి ప్రదక్షిణకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాల్సిందిగా ఆలయ కమిటీ చైర్మన్ శెట్టి చిన్న కోరారు.

ప్రైవేటు విద్యా సంస్థల్లో సీట్లకు రిజిస్ట్రేషన్

కె.కోటపాడు, ఫిబ్రవరి 23 : నూతన విద్యా హక్కు చట్టం ప్రకారం అన్ని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల్లో అర్హులైన విద్యార్థులకు 25శాతం సీట్ల కేటాయింపునకు సంబంధించి ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఎంఈవో-1 కె.సత్యనారాయణ కోరారు. అర్హత గల విద్యార్థుల వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాలను సంబంధిత పాఠశాల, గ్రామ సచివాలయాల్లో ప్రదర్శిస్తారన్నారు. ఇటువంటి విద్యార్థుల ఫీజులను అమ్మఒడి నుంచి పాఠశాలలకు చెల్లించడం జరుగుతుందన్నారు.

వైసీపీ నుంచి జనసేనలో చేరిక



పార్టీలో చేరుతున్న వారికి కండువా కప్పుతున్న సూర్యచంద్ర

గొలుగొండ, ఫిబ్రవరి 23 : మండలంలోని చీడిగుమ్మలలో 25 దళిత కుటుంబాలవారు శుక్రవారం వైసీపీ నుంచి జనసేనలో చేరారు. పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ సమన్వయకర్త రాజాన వీర సూర్యచంద్ర వీరికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలో అరాచకం పెరిగిపోయిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జనసేన గొలుగొండ నాయకులు ముంజేటి గిరిదర్, గండెం దొరబాబు పాల్గొన్నారు.

నాతవరంలో అదనపు ట్రాన్‌ఫార్మర్ పనులు

నాతవరం, ఫిబ్రవరి 23 : మండల కేంద్రం నాతవరంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులు పూర్తయితే తాండవ ఫీడర్‌లో లోవర్ లోడు సమస్య, అలాగే చమ్మచింత తదితర గ్రామాలలో లోవోల్టే సమస్య తీరనుందని ట్రాన్స్‌కో ఏఈ చంద్రమౌళి శుక్రవారం తెలిపారు. గునుపూడి, వెదురుపల్లి గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరైనట్టు చెప్పారు. రానున్న వేసవిలో విద్యుత్ కోతలు లేకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు ఆయన వివరించారు.